# సిగరెట్లు మానేద్దాం

ఆకాశంలో చుక్కల్లేవు.

భూమ్మీద లైట్లూ లేవు.

పైనా, కిందా, యెటు చూసినా ఆడదాని బతుకులా అతి భయంకరమైన చీకటి.

ఆ చీకట్లో... మా డాబామీద...

నాలుగే నాలుగు నక్షత్రాలు మినుగురు పురుగుల్లా మిణుకు మిణుకు మంటున్నాయి.

"అగ్గిపెట్టివ్వండి బాసుగారూ" అన్నారు మా వారు సిగరెట్టు యాష్ ట్రేలో పడేస్తూ.

నాలుగింట్లో ఒక నక్షత్రం రాలిపోయింది.

"సారీ సర్. నేను సిగరెట్లు మానేశాను" అన్నాడతను తన దగ్గర అగ్గిపెట్టె లేనందుకు ఎపోలజెటిగ్గానూ, సిగరెట్లు మానేసినందుకు కొంచెం గర్వంగానూ, అతను పాపం మనిషి మంచివాడేకాని అప్పుడప్పుడు అతన్ని గాంధీగారు ఆవహిస్తూ వుంటారు.

"నేను నమ్మను" అన్నాడు నారాయణరావు, మా వారికి అగ్గిపెట్టె అందిస్తూ.

"నేను నమ్ముతాను" అన్నారు మా వారు అగ్గిపుల్ల అంటిస్తూ. "సిగరెట్లు మానెయ్యడం చాలా తేలిక. నేను లక్ష సార్లు మానేశాను" అన్నారు ఆయన మళ్ళీ.

"ఈ కొటేషను మీది కాదు. మార్క్‌ట్వైన్‌ది" అన్నాన్నేను ఉక్రోషంగా. "నిన్ను చంపేస్తాను అని ఎవరయినా అంటే పోన్లే పాపం అని క్షమించగలను." కాని "నేను సిగరెట్లుమానేశేను" అన్నవాడిని మాత్రం చస్తే క్షమించలేను.

భళ్ళున నవ్వేరు మా వారు.

ఆ నవ్వుకి... నారాయణరావు కాలుస్తున్న సిగరెట్టు పొగ గబుక్కున మింగేసి ఉక్కిరిబిక్కిరై పోయేడు.

పిట్టగోడమీద పడుకున్న పిల్లిపిల్ల దబ్బున కిందపడి పరిగెత్తి పారిపోయింది.

అంతవరకు చీకటిగావున్న ఆకాశంలో గబుక్కున నక్షత్రాలన్నీ ఒక్కసారి వెలిగేయి.

నవ్వడం అయిపోయేక "క్రితం జన్మలో నా పేరుఅదేలే యింతకీ సిగరెట్లు మానెయ్యవచ్చు హార్ట్ ఎటాక్ వస్తే" అన్నారు మళ్ళీ.

"ఇది యీ జన్మ కొటేషన్ కాబోలు. హతోస్మి."

"గురువుగారూ, యీ మధ్య మీకేదో చిన్న హార్ట్ ఎటాక్ లాంటిదేది..." ఆగిపోయేడు రామ్మూర్తి.

ఈసారి వేదాంతిలా చిన్న చిరునవ్వు మాత్రమే నవ్వేరు మా వారు. నవ్వుని అలాగేఉంచి..." లాంటివి కాదు, హార్ట్ఎటాకే వచ్చింది. నా డాక్టరు యేంతున్నాడనుకున్నావు? బొడ్డూడలేదు గుంటడికి. "ఎప్పటినుంచిసిగరెట్లుకాలుస్తున్నారు" అన్నాడు. "నువ్వు పుట్టకముందునుంచి" అన్నాను. "రోజుకి ఎన్ని కాలుస్తార"న్నాడు. చెప్పేను. అంతే మరి నోటంట మాట రాలేదు మానవుడికి. ఆ షాక్ కి కొంపతీసి హార్ట్ఎటాక్ రాలేదు కదా అని భయంవేసింది నాకు. అతని బాధ చూడలేక ఆరువారాలు సిగరెట్లు మానేశేను. యింతకీ యీ సిగరెట్లు యీ హార్ట్ఎటాక్ లు నన్నేం చెయ్యావు నేను మహార్షిని" అన్నారు కళ్ళు మూసుకొని, మఠం వేసుకొని, సిగరెట్టు కాలుస్తున్న మహర్షిలా.

ఆయన మహర్షి అవునో కాదో నాకు తెలీదు కాని, యీ సిగరెట్ల లెక్చర్లు విని నా బుర్ర పిచ్చెక్కిపోతోంది. ప్రతి గొంగళిపురుగు సీతాకోక చిలక అవుతుంది(ట).

కాని ప్రతి ప్లీడరు జడ్జి కాలేదు.

మా వారు గొంగళిపురుగు దశలా వున్న రోజుల్లో....

ఆవేళ...

అన్నానికి రావడమే ఆకలిమీదున్న పెద్దపులిలా ఆవురావురుమంటూ వచ్చేరు.

పీటమీద కూర్చున్నారు - అప్పటికింకా మేమింకా డైనింగు టేబుల్ యెత్తుకి యెదగలేదు.

నాకు ఒంటిమీదకి తెలివి వచ్చేసరికి మా అమ్మమ్మ గారు పెంకులు ఏరుతూ "ఏఁవిఁటో! నేను నీ అంత ఉన్నప్పటి నుంచి ఈ పెంకులు ఏరుతూనే వున్నాను. ఏం చేస్తాం. వాళ్ళ నాన్న నన్ను తినేసేరు. వీడు నిన్ను తినేస్తున్నాడు. కట్టుకున్న దాన్ని సుఖపెట్టడం ఎంతమందికి తెలుసు? కట్టుకున్నాక పడక తప్పదు. ఛ! ఛ! ఏఁవిఁటది? లే. లే. తప్పు. కళ్లూ ఒళ్లూ తుడుచి కొనిరా, నట్టింట ఆడపిల్ల కంటతడి పెట్టకూడదు. (మొగాడు వంటింట్లో కూర కంచాలు విసరొచ్చునా?) వెర్రిపిల్లా... సాయంత్రానికి వాడే సర్దుకుంటాడు..." అంటూ పెంకులు పారెయ్యడానికి పెరట్లోకి వెళ్ళింది.

సాయంత్రం అయింది.

వారు సర్దుకోలేదు.

రాత్రి అయింది. అయినా సర్దుకోలేదు.

సర్దుకోవడం మాట దేవుడెరుగు అసలు పడుకోలేదు, కూర్చోలేదు.

అలా నొప్పులు పడుతున్న గొడ్డులా గిర గిర గదంతా తిరుగుతూనే ఉన్నారు.

"భగవాన్! అసలే వీళ్ళ వంశంలో వెలక్కాయంత వెర్రి ఉంది. కొంపతీసి..." ఇంక ఆలోచించడానికి నాకు ధైర్యం చాలలేదు.

ఆ మర్నాడు, ఆ మర్నాడు, మరో వారం రోజులు....

మా ప్రోగ్రాంలో మాత్రం మార్పేమీ లేదు నా

స్నానంలో తప్ప. ఒకరోజు చారుస్నానం మరో రోజు మజ్జిగ పులుసు...మా అమ్మమ్మ గాజు పెంకులో కూరముక్కలో ఏరుతూనే ఉంది. మొదట్లో నాకు భయంవేసినా, తరవాత్తర వాత.... చెప్పొద్దూ జాలేసింది.

ఒకవేళ ఏదైనా పెద్ద సెన్సేషనల్ కేసుగాని చేస్తున్నా రేమో? కొంపతీసి మునసబు ముండావాడు ఆ కేసు ముంచీ లేదుకదా? అసలే వాడొట్టి మూడీఫెలో అట-ఇంట్లో పెళ్ళాం బాధ పడలేక పొద్దున పదినుంచి రాత్రి పదకొండువరకు అలా కోర్టు చేస్తూనే ఉంటాట్ట, గుమాస్తాలంతా ఒకటే గోల— కానీ.... కేసు యిన్నాళ్లా!

ఒకవేళ...ఏదైనా లవ్ ఎఫైరేమో!

ఛ! ఛ! అంత సరసత కూడానా మానవుడికి!

మరేమిటి?

సంగతేమిటంటే...

"మనం రేపటినుంచి సిగరెట్లు సిన్సియరుగా మానేద్దాం" అన్నాట్ట ఆనందరావు. ఆనందరావు అతి ఉత్తముడు. అయితే అతనికి నెలకో, ఆర్నెల్లకో బుద్ధుడు కలలో కొస్తాడు. వచ్చిన వాడు వెంటనే వెళ్ళకుండా ఓ వారం వుంటాడు.

"నిరభ్యంతరంగా" ఒప్పుకున్నారీయన.

ఇంతవరకు కథ, డైలాగులు బాగానే వున్నాయి. ఆ తరవాత పదిరోజులు కథ క్లైమాక్సు నా చారుస్నానాల్లో గడుస్తోంది.

పదకొండో రోజు.

"ఒరే అబ్బీ! మనం సిగరెట్లు మానీటంవల్ల జరిగే నష్టాలు నువ్వెప్పుడైనా ఆలోచించేవా?" అనడిగేరు మావారు ఆనందరావుని.

"...చించలేద" న్నాడతను.

"మొన్న ముకుందం సిగరెట్టు ఆఫర్ చేశాడు. మనం ప్రిన్సిపల్ అంటే ప్రిన్సిపులే కదా. మరింక ఆ దేవుడొచ్చి "నరసింగరావు, ఈ సిగరెట్టు కాల్చు" అన్నా సరే "ఛీ పో" అంటాను. ఇక యీ ముకుందం ఒక లెక్కా? ఒద్దన్నాను స్ట్రైట్‌గానే. దాంతో వాడు ఊరుకోవచ్చునా? ఉహుఁ తేలు మింగినవాడిలా ఒకటే గెంతులు. "ఏం? అక్కడికి నువ్వొక్కడివే బుద్ధిమంతుడివి, మేమంతా వెధవలవేనా? ఈ బుద్ధి నీకే పుట్టిందా లేక ఆ బుద్ధభక్తుడు నేర్పేడా? ఈ బోడి సిగరెట్లు మానేసి మూడు మేడలు కట్టేస్తావా? ముప్పై భవంతులు కొనేస్తావా? లేకపోతే కొంపతీసి "నరసింగరావు చాలా మంచివాడు" అన్న బిరుదు కొట్టేద్దామనుకుంటున్నావా? మంచితనానికి కొలబద్ద సిగరెట్లు కాదు" అంటూ ఉసిరికాయలు దులిపినట్లు దులిపేసేడు. వాడు దులిపినందుకు నేనేం బాధపడ లేదు కాని యిలా మనం ఒకొక్కర్ని హర్ట్ చేసుకుంటూ పోతే మనకింక ఫ్రెండన్నవాడు మిగులుతాడంటావా?" అని వాపోయేరు మా వారు.

మిగలరని ఒప్పుకున్నాడు ఆనందరావు.

"నాకేం పాలుపోవడంలేద"ని బాధకూడా పడ్డాడు.

"నీ కెప్పుడూ పాలూపోదు, పెరుగూపోదు" అని జోకేసి ఉపాయం ఆలోచించేరు మా వారు.

చదువుకునే రోజుల్లో మా వారు 'లా' కాలేజీ గోల్డ్ మెడలిస్టు (నా గోల్డ్ మా ఆవిడ మెడలో వేస్సేను అంటూ వుంటారు అప్పుడప్పుడు) ఆయన "కాన్స్టిట్యూషనల్ లా"లో పాఠ్యాలని కూడా పర పర నమిలేస్తారు. మరంచేత "విషం ఎప్పుడైతే వుందో విరుగుడూ అప్పుడే వుంటుంది. 'లా' ఎప్పుడైతే వుందో ఎమెండ్మెంటూ అప్పుడే వుంటుంది. 'లా'ని ఏ చవటైనా చెయ్యగలడు. ఎమెండ్ చెయ్యడంలోనే వుంది గొప్పతనమంతా. ప్రిన్సిపుల్స్ అనేవి ఎప్పుడూ మంచికే. కాని...మన ప్రిన్సిపుల్స్ కోసం మరొకడ్ని బాధపెట్టం వుంది చూసేవూ...ఇటీజ్ వెరీ బేడ్. మరింక మన మాట పోకుండా, మరొకడ్ని బాధపెట్టకుండా ఉండాలంటే ఒకే ఒక ఉపాయం ఉంది..." ఎఫెక్టుకోసం ఆగేరు.

ముగ్ధుడై వింటున్నాడు ఆనందరావు.

తను అనుకున్న ఎఫెక్టు వచ్చిందన్న నమ్మకం కుదిరేక "....ఏమిటంటే...మనంతట మనం కొని ఛస్తే కాల్చొద్దు. కాని ఎవరైనా ఆఫర్ చేస్తే మాత్రం తీసుకొని కాలుద్దాం. ఏమంటావ్?" అన్నారాయనే మళ్ళీ.

మా వారు దుర్యోధనుడైతే ఆనంధరావు కర్ణుడు.

ఆయన శ్రీరాముడైతే అతను హనుమంతుడు.

బ్రహ్మాండంగా వుందన్నాడతను.

* * *

సాంప్రదాయాలు గమ్మత్తుగా ఉంటాయి. కొండొకచో అనుకూలంగానూ వుంటాయి.

పసిపిల్లల దగ్గరకీ, పేషెంట్ల దగ్గరికీ వట్టి చేతుల్తో వెళ్ళకూడదు. (దేవుడి దగ్గరకూ్కడా నట).

మందు తాగేవాడెప్పుడూ (జబ్బుకాక్కదని మనవి) పక్కవాడికి ఆఫర్ చెయ్యకుండా తాగడు, తాగకూడదు.

సిగరెట్లు కాల్చేవాడు సాధారణంగా (మరీ కక్కుర్తి వెధవైతే తప్ప) పక్కనున్న వాడికి ఆఫర్ చేస్తాడు - (యీ సాంప్రదాయం అధికార్ల దగ్గరా, ఆడవాళ్ళదగ్గరా వర్తించదు.)

మనది పవిత్ర భారతదేశం.

సాంప్రదాయాల పుట్టిల్లు. సంస్కృతి మన ఊపిరి. మనం యీ మాత్రంగా బతుకుతున్నామంటే దానికాక్కరణం మన సత్ సాంప్రదాయాలే. మన సాంప్రదాయాల్ని, సంస్కృతిని చూసి అమెరికావాడు కూడా అసూయ పడవల్సిందే.

ఏతా వాతా మా వారూ, ఆనందరావూ సిగరెట్లు ఆఫర్లకెప్పుడూ యిబ్బందిపడలేదు. ఇబ్బందంతా పనివున్నా లేకపోయినా పొద్దున పదినుంచి సాయంత్రం ఐదువరకు బాత్ రూములోనూ, సాయంత్రం ఐదునుంచి రాత్రి పదివరకూ సెంటర్లోను వుండవలసి రావడమే.

ఆవేళనుంచి నేను మంచినీళ్ళ స్నానమే చేస్తున్నాను. మా అమ్మమ్మ గాజుపెంకుల ఏరుడుపోయి కృష్ణా, రామా అనుకుంటోంది. ఇది యిలా జరిగినా యీ కథ యిక్కడితో సుఖాంతం అయిపోయేది. కాని...

రోజులెప్పుడూ ఒక్కలాగే జరగవు అన్న మా అమ్మమ్మ ఉవాచకి నిదర్శనంగా, మావారి ఫ్రెండు పెళ్ళి నిశ్చయమైంది అనుకోకుండా.

ఆ ఫ్రెండుకి అసలు చిన్నప్పటినుంచి 'పిల్ల'గాలి అంటే పడదు. 'ఆడ' వాసనంటే అసహ్యం. అలాంటివాడు అకస్మాత్తుగా పెళ్ళి చేసుకుంటున్నాడంటే మావారు అమిత సంతోషించారు. ఆ సంతోషం అట్టేసేపు నిలవలేదు పెళ్ళి తిరుపతిలో అని తెలియగానే.

"తిరపతిలో పెళ్ళేవిఁట్రా నీ మొహం" అని తిట్టేరు కూడా ఆ ఫ్రెండుని.

"పెళ్ళికూతురు మేనత్త మొక్కుకుందిట" అదేదో హత్యాపరాధం అనంత దీనంగా అన్నాట్ట ఆ ఫ్రెండు.

"వెంకటరవఁణమూర్తికీ నీకూ వైరం ఏంలేదు కదా. రావడానికి నీ అభ్యంతరం ఏఁవిఁటి?" అడిగేడు ఆనందరావు.

"అజాత శత్రువుని. నాకేఁవిఁటి? అండమాన్‌లో చేసుకున్నా నాకేం అభ్యంతరంలేదు. అభ్యంతరం ఒక్కటే, మనకి సిగరెట్లు ఆఫర్ చేసే వాడెవడూ వుండడు. ఉన్న ఒక్కడూ పీటల మీద కూర్చుంటాడు" బెంగపెట్టుకున్నారు మా వారు. అంత చిన్న విషయం తనకు తట్టనందుకు ఆశ్చర్యపోయేడు ఆనంద

రావు. అయితే అతను మా వారిలా బెంగపెట్టుకోలేదు, మా వారి తెలివి తేటలమీద అపారమైన నమ్మకంవల్ల.

అతని నమ్మకం వమ్ముచెయ్యలేదు ఈయన.

తక్షణం రాజుకి కబురు చేసేరు "సిరికిం చెప్పడు"లా లేచిరమ్మని.

మరుక్షణమే వచ్చేడతను.

మా వారికి ఆనందరావు మొదటి హనుమంతుడైతే, రాజు రెండో హనుమంతుడు. అందుకే "నేను శ్రీరామ చంద్రుడుకంటె గొప్పవాణ్నే అమ్మో" అంటూంటారు ఆయన.

మావారి ఉపోద్ఘాతాలంటే యిష్టంలేదు. "కమ్ టు ది పాయింట్" మనిషి. అంచేత ఫలానా తారీఖున ఫలానా వాడి పెళ్ళికి మనం తిరుపతి వెళ్తున్నాం. తయారుగా వుండమన్నారు రాజుతో.

"ఉండడానికి తనకేం అభ్యంతరంలేదు. కాని తనకీ ఆ ఫలానా వాడికీ వెళ్ళేటంత పరిచయం లేదే" నసిగాడు రాజు.

ఆంజనేయుడు "ఛీ రామా" అన్నాకూడా రాముడికి బహుశా అంతకోపం వచ్చి, వుండదు. మా వారికి మాత్రం తన రెండవ హనుమంతుడు తన మాటకి ఎదురు చెప్పగానే సర్రున కోపం వచ్చింది. అయితే "మహర్షిలాంటి వాణ్ని" కాబట్టి తమాయించుకున్నారు.

"ఒరే రాజూ! నువ్వెప్పుడైనా పెళ్ళి శుభలేఖ పూర్తిగా చదివేవా?...లేదు...ఏం?.. అందులో అడుగున బంధు మిత్ర సపరివార సహితంగా అని ఎందుకురాస్తారో తెలుసా? నీలాంటి

చవటలుంటారనే. నీ ఫ్రెండ్సు అందర్నీ తీసుకొని రా అని అర్థం. మొత్తానికి ఆ శుభలేఖ మొదట యెవడు రాసేడో కాని గొప్ప అనుభవంమీద రాసేడని మాత్రం ఒప్పుకోవాలి మనం..." పిచ్చికబుర్లు మానేసి "బీ రెడి" ఆజ్ఞ వేశారు మా వారు. ఆయనది సుగ్రీవాజ్ఞ.

"శలవు లేదురా" మొరపెట్టుకోబోయేడతను.

మా వారికి మళ్ళీ సర్రున కోపం వచ్చింది. మళ్ళీ తమాయించుకున్నారు. "ఛీ. ఛీ. ఇంత చవటవి. నీతో మీ ఆవిడ కాపరం యెలా చేస్తోందో? ఐ రియల్లీ పిటీ హర్" అని అతని పెళ్ళాంమీద జాలిపడి "శలవులుంటే జబ్బులొస్తాయి, జబ్బు చేస్తే శలవలొస్తాయి. డాక్టర్ల దగ్గర సర్టిఫికెట్లుంటాయి పో, పో. పోయి తయారుగా వుండు" అని వుపాయం చెప్పేరు.

మొత్తానికి ముగ్గురూ పెళ్ళికి వెళ్ళేరు. మనలో మగ పెళ్ళివారంటే మహారాజుతో సమానం. పెళ్ళికొడుకు ఫ్రెండ్సంటే ప్రిన్సాఫ్ వేల్సులు. అనుకున్న టైంకు కట్నం కొంత అటో యిటో అయినా ఫరవాలేదు కాని పెళ్ళికొడుకు ఫ్రెండు అలిగితే మాత్రం పెళ్ళి ఆగిపోయే ప్రమాదం వుంటుంది.

అంచేత వీళ్ళకి కాఫీ, భోజనాల్తోపాటు, పేకలు, సిగరెట్లు విరివిగా సప్లై అయేయిట.

"ఆఫ్‌కోర్స్ నాకై నేనుగా ఒక్క సిగరెట్టుకూడా ముట్టుకోలేదు. ఒక్కొక్కటి ఆఫర్ చెయ్యటం ఎవరికైనా విసుగేకదా. అంచేత రాజు రెండేసి పేకెట్లు ఒక్కసారేయిచ్చే వాడు... అయిడియా నాదే అనుకో. యు మస్ట్ బి ప్రౌడ్ ఆఫ్ యువర్ హజ్బెండ్" అన్నారు మావారు పెళ్ళినుంచి తిరిగొచ్చిన్నాడు రాత్రి నా మొహం మీదికి సిగరెట్ పొగ వదుల్తూ.

ఆ సిగరెట్ నేను ఆఫర్ చెయ్యలేదు.

మరి "యిదేవిటి?" అన్నాను పొగ నుంచి తప్పించుకుంటూ.

"అదంతే" అన్నారు భగవద్గీత బోధిస్తున్న కృష్ణుడిలా.

అదేవిటో తరవాత ఆనందరావు చెప్పేడు.

లగ్నం అయేవరకూ జలపాతంలా పారిన సిగరెట్లు మంగళసూత్రధారణ అయిన మరుక్షణం టక్కున ఆగిపోయేయిట. యీ సంగతి ఊహించని రాజు అక్షింతలు అందుకొని ఊర్లోకి షికారెళ్ళేట్ట.

"యిడియట్. క్షణం కాలు నిలవదు. మనం వచ్చింది పెళ్ళికా, షికార్లకా?" అని తెగ విసుక్కున్నారట మావారు. పోనీ వెళ్ళినవాడు వెంటనే వచ్చేడా? వస్తే కథేవుంటుంది? మా వారికీ ఆనందరావుకీ నాలిక పిడచకట్టుకుపోతోందింట. బుగ్గలు పీకేస్తున్నాయి. పెళ్ళికొడుకు కనిపించినా బావుణ్ను?

కన్యాదానంకూడా కాకుండానే కొంగుపట్టుకొని తిరిగే వీడెందుకు పనికివస్తాడు? ఆ అమ్మాయితో ఒకటే నవ్వులు, కబుర్లు. సిగ్గయినా లేదు” యిదీ మా వారి అమూల్య అభిప్రాయమే. అయితే ఎంతటి ఆపదలోనైనా ఆయన బుర్ర పాదరసంతో పరిగెడుతుంది.

“ఒరే ఆనందం” పిల్చేడు.

“ఓయ్” అని పలకడానికి నాలిక యెండిపోయిన ఆనందరావు జాలిగా చూశేడు.

“ఒరే ఆనందం, నేనో మాట చెప్తాను విను. మనం యిలా సిగరెట్లు కాల్చం, సినీమాలు చూడ్డం. పెళ్ళాన్ని పలకరించం అంటూ మనమీద మనవే ఆంక్షలు పెట్టుకుంటే ఇంక మనం బతకడం దేనికి? అసలు లైఫ్‌లో త్రిల్ ఏవుంటుంది. త్రిల్ లేని బతుకెందుకురా? వట్టి వేస్ట్. అదుగో... మన మునసబుని చూడూ. ఒక సిగరెట్టులేదు. సరదాలేదు. పులుసు తాగిన పిల్లిలా మొహం పెట్టుకొని పగలంతా మనల్ని రాత్రి మరొకర్ని తినీడం. ఛీ. ఛీ. యింక... ఈ ప్రిన్సిపుల్స్ అంటావా... యివి మనం పెట్టుకున్నవే. మనం పెట్టుకున్నదాన్ని మనవే తీసీసుకోవచ్చు నిక్షేపంగా. అసలీ రూల్సు అనేవి అతిక్రమించడానికే అన్నాడో మహానుభావుడు. అదీకాక మన లైఫ్ సిగరెట్ ఖరీదు చెయ్యదంటావా?...” అన్నారుట మా వారు,

ఆనందరావు ఎఁవీఁ అన్లేదు.

వెళ్ళి సిగరెట్లు కొనితెచ్చేడుట. అదీ కథ.

"హార్ట్ ఎటాక్ వచ్చేకకూడా సిగరెట్లు కాలుస్తున్నా రంటే...." మధ్యలోనే ఆపేసేడు రామ్మూర్తి.

యీసారి నిజంగా మహర్షిలా నవ్వేరు మా వారు.

"మా మాఁవఁ. అంటే యీవిడ బాబు... అతను సిగరెట్లు కాల్చలేదు సరికదా నేను ఈ గదిలో సిగరెట్ కాలుస్తే పక్కగదిలో వుండేవాడు... ఏవేఁ అమ్మడూ... అంతేనా... ఆఖర్న ఏవఁయ్యేడు? హార్ట్ ఎటాక్ వచ్చి హారీమన్నాడు... నేను చైన్‌స్మోకర్ని. నాకూ యెటాక్ వచ్చింది. పోయింది. ఎలా వున్నానో చూస్తున్నారు కదా... ఇనప స్తంభంలా వున్నాను..." అంటూ సిగరెట్ అంటిచేరు. ★